
www.prajasakti.com
ప్రజాశక్తి
బుధవారం 3 జనవరి 2024
5
తిరుపతి





గ్రామసభలో సమస్యలపై నిలదీస్తున్న రాజేశ్వరి

చంద్రగిరిలో..



పుత్తూరులో..



'దున్నపోతు' ప్రభుత్వం

నాయుడుపేటలో..



జరిగింది చెబుతా.. జరగాల్సింది చెబుతా.. 'సోది' చెబుతానమ్మ 'సోది'

ఇంటికెళ్లడం ఖాయం

'సోది' చెప్పిన అంగన్‌వాడీలు

జిల్లావ్యాప్తంగా నిరసనల హోరు

నేడు కలెక్టరేట్ ముట్టడికి సన్నద్ధం

గత 22 రోజులుగా నిరవధిక సమ్మె చేస్తున్నా దున్నపోతుపై వర్షం పడిన చందంగా రాష్ట్ర ప్రభుత్వం వ్యవహరిస్తోంది' అంటూ అంగన్‌వాడీలు అగ్గిమీద గుగ్గిళమయ్యారు. వినతిపత్రాలు ఇచ్చిన హామీలు నెరవేర్చని జగన్మోహన్‌రెడ్డికి ఇచ్చినా ఒకటే, దున్నపోతుకు ఇచ్చినా ఒకటే అంటూ జిల్లావ్యాప్తంగా దున్నపోతులకు మంగళవారం వినతిపత్రాలు ఇచ్చారు. నాయుడుపేటలో అంగన్‌వాడీలు హామీలు నెరవేర్చని జగన్మోహన్‌రెడ్డి ఇంటికెళ్లడం ఖాయం అంటూ 'సోది' చెబుతూ వినూత్నంగా నిరసన తెలిపారు.

నేడు కలెక్టరేట్ ఎదుట బైఠాయింపు

ప్రజాశక్తి - తిరుపతి బ్యూరో

జగన్మోహన్‌రెడ్డి మొండివైఖరిని నిరసిస్తూ ఆంధ్రప్రదేశ్ అంగన్‌వాడీ వర్కర్స్ అండ్ హెల్పర్స్ యూనియన్ ఆధ్వర్యంలో బుధవారం కలెక్టరేట్ ఎదుట తలపెట్టిన బైఠాయింపు కార్యక్రమాన్ని జయప్రదం చేయాలని అధ్యక్ష కార్యదర్శులు పద్మలీల, వాణిశ్రీ పిలుపునిచ్చారు. ఉదయం 9 నుంచి సాయంత్రం 4 గంటల వరకు ఈ కార్యక్రమం జరగనుంది. జిల్లాలోని 12 ప్రాజెక్టులకు చెందిన అంగన్‌వాడీ వర్కర్లు, మినీ వర్కర్లు, ఆయాలు పెద్దసంఖ్యలో తరలిరావాలన్నారు. తప్పనిసరిగా యూనిఫాంలో రావాలని, ప్రతి కార్యకర్త సొంతంగా భోజనం, వాటర్‌బాటిల్ తీసుకురావాలని, వచ్చేటపుడు నల్లటి గొడుగు తేవాలని సూచించారు. సిఐటియు సంఘీభావం ప్రకటించింది.

ప్రజాశక్తి - యంత్రాంగం

– నాయుడుపేటలో సిఐటియు జిల్లా నాయకులు ఎ.పుల్లయ్య పాల్గొన్నారు. ఓ అంగన్‌వాడీ మహిళ 'సోది చెబుతానమ్మ సోది' అంటూ జగనన్న పాదయాత్రలో ఇచ్చిన వాగ్దానాలన్నీ సోదిగా చెప్పి వినిపించారు. ఈ కార్యక్రమంలో నాయకులు శివకవి ముకుంద, అంగన్‌వాడీ ప్రాజెక్టు కార్యదర్శి ఎన్.శ్యామలమ్మ, సంధ్య, నాగమణి, చంగమ్మ, కళావతి, వి.శ్యామలమ్మ, మేరి, ప్రమీల పాల్గొన్నారు.

– తిరుపతి టౌన్‌లో సిఐటియు జిల్లా ప్రధాన కార్యదర్శి కందారపు మురళి మద్దతు ప్రకటించారు. 22 రోజులుగా రాష్ట్రంలోని 56వేల అంగన్‌వాడీ సెంటర్లను మూసివేసి, లక్ష మందికి పైగా అంగన్‌వాడీలు పెద్దఎత్తున పోరాటం చేస్తుంటే జగన్మోహన్‌రెడ్డి ప్రభుత్వం ఉదాసీనంగా వ్యవహరించడం దారుణమన్నారు. ప్రభుత్వ నిర్లక్ష్యం వల్ల పౌష్టికాహారం గత 22 రోజులుగా ఆగిపోయిందన్నారు. తిరుపతిలోనూ దున్నపోతుకు వినతిపత్రం అందించారు. 3వ తేదీ చేపట్టిన కలెక్టరేట్ ముట్టడి కార్యక్రమాన్ని జయప్రదం చేయాలని పిలుపునిచ్చారు. నాయకులు కె.వేణుగోపాల్, టి.సుబ్రమణ్యం, టిటిడి కాంట్రాక్టు కార్మికులు రఘు, త్యాగరాజు, పార్థసారథి, బాలాజీ పాల్గొన్నారు.

– సూళ్లూరుపేటలో ఆవుకు వినతిపత్రం అందించారు. సిఐటియు నాయకులు ఎ.పుల్లయ్య, కె.సాంబశివయ్య, సిహెచ్ సుధాకర్‌రావు సంఘీభావం ప్రకటించారు. అంగన్‌వాడీ నాయకురాలు మేకల హైమావతి మాట్లాడుతూ కార్మికులకు న్యాయం జరిగేంత వరకూ ప్రశాంతంగా కలసికట్టుగా పోరాడాలన్నారు.

– గూడూరు టౌన్‌లో పాత ఆర్టీసీ బస్టాండ్ వద్ద నిరసన దీక్ష కొనసాగించారు. ఇంద్రావతి, ప్రభావతి, ప్రసన్నలక్ష్మి, పెంచలమ్మ, సిఐటియు నాయకులు సురేష్ పాల్గొన్నారు.

– పుత్తూరు టౌన్‌లో తహశీల్దార్ కార్యాలయం వద్ద సమ్మె కొనసాగింది. సిఐటియు నాయకులు ఆర్.వెంకటేష్ ఆధ్వర్యంలో అంబేద్కర్ సర్కిల్ వద్ద దున్నపోతుకు అర్జీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో ముని కుమారి, విజయ కుమారి, కష్ణవేణి, ధనమ్మ, రాధా, పద్మజ పాల్గొన్నారు.

– శ్రీకాళహస్తిలో రైతుసంఘం, విఒఎల నేతలు మద్దతు ప్రకటించారు. ఏపీ రైతు సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ప్రభాకర్ రెడ్డి మాట్లాడుతూ అంగన్వాడీల పట్ల జగన్ ప్రభుత్వం వ్యవహరిస్తున్న తీరు బాధాకరమన్నారు. అంగన్వాడీలు గొంతెమ్మ కోర్కెలు కోరలేదనీ, న్యాయపరమైన డిమాండ్లను జగన్ సర్కార్ పరిష్కరించాల్సిన అవసరం ఉందని అభిప్రాయపడ్డారు. నాయకులు గెడి వేణు, రామయ్య, దాసరి జనార్ధన్, హేమలత పాల్గొన్నారు.

– సత్యవేడులో సిఐటియు డివిజన్ కార్యదర్శి రమేష్ ఆధ్వర్యంలో కళ్లకు నల్ల రిబ్బన్ కట్టుకుని నిరసన తెలిపారు. అనంతరం దున్నపోతుకు వినతిపత్రం ఇచ్చారు. సమస్యలు పరిష్కారమయ్యే వరకూ సమ్మె ఆపే ప్రసక్తే లేదని తేల్చి చెప్పారు. నిర్మల, శాంతి, ఇందిర, ఝాన్సీ, భారతి, కాంతమ్మ తదితరులు పాల్గొన్నారు.

– రేణిగుంటలో జీసస్ ఆటోస్టాండ్ కార్మికులు మద్దతు ప్రకటించారు. 'దున్నపోతు యమధర్మరాజు'కు వినతిపత్రం సమర్పించారు. పదో రోజు రిలే దీక్షలో అంబిక, మరియమ్మ, కోమల, మాధవి, పుష్పలత, పవిత్రభాయి, రేఖ, అంజీరమ్మ, కవిత, మునిలక్ష్మి పాల్గొన్నారు. నాయకులు హరినాథ్, కరీముల్లా పాల్గొన్నారు.


నీటి సమస్యపై నిలదీసిన సిపిఎం ఎంపిటిసి

ప్రజాశక్తి - రేణిగుంట

రేణిగుంట పంచాయతీ కార్యాలయం వద్ద గ్రామసభ మంగళవారం జరిగింది. ఈ సందర్భంగా సిపిఎం ఆధ్వర్యంలో రేణిగుంటలో నీళ్ల సమస్య, జగనన్న ఇంటి పట్టాలకు స్థలాలు మండల పరిధిలోనే కేటాయించాలని, గ్రామ పంచాయతీ స్వాధీనంలో ఉన్న స్థలాలు ఆక్రమణకు గురౌతున్నాయని, ఆక్రమణ దారులపై చర్యలు తీసుకోవాలని సిపిఎం ఎంపిటిసి ఎన్.రాజేశ్వరి నిలదీశారు. మండల అధికారులు హరిబాబు, రత్నకుమారి, సర్పంచి నగేష్‌లకు సిపిఎం నాయకులు ఒ.వెంకటరమణ, కుప్పస్వామి, సెల్వరాజ్, హరినాథ్, ఈశ్వరమ్మలతో కలిసి వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఎన్.రాజేశ్వరి మాట్లాడుతూ రేణిగుంటలో నీటి సమస్య తీవ్రంగా ఉందని, పది రోజులు పైబడి నీళ్లు వదులుతున్నారని, మహిళలు, ముఖ్యంగా ఉద్యోగులు ఇబ్బందులు పడుతున్నారన్నారు. నీటి సమస్యను శాశ్వతంగా పరిష్కరించాలని డిమాండ్‌చేశారు. పేదలకు సెంటు జాగా లేదన్నారు. పంచాయతీ స్థలాలు ఆక్రమించిన వారిపై చర్యలు తీసుకోవాలన్నారు. కాంగ్రెస్ నాయకులు రావణ, చిరంజీవి, జూనియన్ రాజు పాల్గొన్నారు.

నష్టపోయిన రైతులకు ఎకరాకు రూ.30వేలివ్వాలి

ప్రజాశక్తి–శ్రీకాళహస్తి



మిచౌంగ్ తుఫాన్ కారణంగా నష్టపోయిన రైతాంగాన్ని ప్రభుత్వం తక్షణమే ఆదుకోవాలని ఆంధ్రప్రదేశ్ రైతు సంఘం ప్రధాన కార్యదర్శి ప్రభాకర్ రెడ్డి డిమాండ్ చేశారు. స్థానిక పుచ్చలపల్లి సుందరయ్య భవన్ లో మంగళవారం జిల్లా రైతు సంఘం కమిటీ సమావేశం నిర్వహించారు. ప్రభాకర్ రెడ్డి మాట్లాడుతూ మిచౌంగ్ తుపాను ధాటికి భారీగా పంటలు, పంట భూములు, రహదారులు, ధ్వంసం అయ్యాయని చెప్పారు. తుపాను ధాటికి నష్టపోయిన ప్రతి రైతుకు ఎకరాకు రూ.30 వేల రూపాయలు చొప్పున పరిహారం చెల్లించాలని డిమాండ్ చేశారు. రాష్ట్ర ప్రభుత్వం రైతులకు జరిగిన నష్టపరిహారాన్ని అంచనాలు వేయడంలో తీవ్ర అలసత్వం ప్రదర్శించిందని విమర్శించారు. గ్రామీణ ప్రాంతాల్లో రైతు భరోసా కేంద్రాలు అలంకారప్రాయంగా మారాయనీ, రైతుల పంట కొనుగోలుకు నోచుకోక దళారీల బారినపడి గిట్టుబాటు ధర కోల్పోతున్నారని ఆవేదన చెందారు. రాష్ట్ర ప్రభుత్వం తక్షణమే కొనుగోలు కేంద్రాలు ఏర్పాటు చేసి రైతుల పండించిన ధాన్యాన్ని కొనుగోలు చేయాలని ప్రభుత్వానికి విజ్ఞప్తి చేశారు. తిరుపతి జిల్లాలో చెరుకు రైతులకు రావాల్సిన బకాయిలను ఐదు సంవత్సరాలు దాటుతున్నా యాజమాన్యాలపై చర్యలు తీసుకోకుండా కాలయాపన చేస్తోందన్నారు. రైతులు అప్పులు చేసి పెట్టుబడులు పెట్టి పంటలు పండిస్తే, ఐదు సంవత్సరాలుగా రైతులకు చెరుకు బకాయిల చెల్లించకపోతే ఈ ప్రభుత్వం ఏమి చేస్తున్నదని ప్రశ్నించారు. జిల్లాలో అసంపూర్తిగా ఉన్న సోమశిల స్వర్ణముఖి కాలువ, తెలుగంగ కాలువ పనులను సత్వరం పూర్తి చేయాలని కోరారు. ఈ సమావేశంలో ఆంధ్రప్రదేశ్ రైతు సంఘం జిల్లా అధ్యక్ష కార్యదర్శులు దాసరి జనార్ధన్, హేమలత, జిల్లా కార్యవర్గ సభ్యులు రంగయ్య, అల్లెయ్య, బాలగురవయ్య, ముని శంకర్ పాల్గొన్నారు.

ప్రజారోగ్యమే పరమావధి : జేసీ

ప్రజాశక్తి - తిరుపతి టౌన్

దేశంలో ఏ రాష్ట్రంలోనూ అమలు చేయని విధంగా ప్రజల ఆరోగ్యమే పరమావధిగా ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా తలపెట్టిన జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమం రెండో దశను ప్రజలందరూ సద్వినియోగం చేసుకోవాలని జాయింట్ కలెక్టర్ శుభం బన్సల్ తెలిపారు. మంగళవారం ఉదయం జెసి పనబాకం గ్రామం, చంద్రగిరి మండలం జెడ్పీ ఉన్నత పాఠశాలలో ఏర్పాటు చేసిన జగనన్న ఆరోగ్య సురక్ష రెండో దశ కార్యక్రమంలో రాష్ట్ర పరిశీలకులు జగనన్న ఆరోగ్య సురక్ష రమాదేవి, డి ఎం హెచ్ ఓ శ్రీహరి, జిల్లా ఆరోగ్యశ్రీ సమన్వయ కర్త రాజశేఖర్ రెడ్డి, జే ఎ యస్ నోడల్ అధికారిని తేజస్విని, జిల్లా టీబీ, లెప్రసి నియంత్రణ అధికారిని అరుణ సులోచన దేవి, చెవిరెడ్డి హర్షిత్ రెడ్డి, ఎంపీపీ హేమెంద్ర కుమార్ రెడ్డి, వైస్ ఎంపీపీ మణియాదవ్ తదితరులతో కలిసి పాల్గొన్నారు.

ఈ సందర్భంగా జెసి మాట్లాడుతూ గతంలో సుమారు 45 రోజులు జగనన్న ఆరోగ్య సురక్ష మొదటి దశ ఎంతో సమర్థవంతంగా అమలు చేశామని, ప్రజల ఇంటికే వెళ్లి వారికి పరీక్షలు నిర్వహించి వారికీ చికిత్స, మందులు అందించడం, రెఫరల్ హాస్పిటల్ కు పంపి చికిత్స అందించి వారికి రోగ నిర్ధారణ పరీక్షల ద్వారా వ్యాధులను ముందుగానే గుర్తించి వాటికి చికిత్స ద్వారా వారి ఆరోగ్యాన్ని కాపాడే కార్యక్రమం నిర్వహించడం జరిగిందని, రెండవ దశలో అసంక్రమిత వ్యాధులు అయిన బిపి, సుగర్ వ్యాధి తదితర దీర్ఘకాలిక వ్యాధుల గుర్తింపు పరీక్షలు నిర్వహించి, మెడికల్ క్యాంపులు నిర్వహించి రెఫరల్ అవసరమైతే ఆరోగ్యశ్రీ నెట్వర్క్ ఆసుపత్రుల్లో చేయించి మందులు అందించి ఫాలో అప్ చేస్తామన్నారు. ఈ కార్యక్రమం 6 నెలల పాటు షెడ్యూల్ మేరకు నిర్వహించ బడుతుందని, ప్రజలందరూ సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

మున్సిపల్ కార్మికుల అర్ధనగ్న ప్రదర్శన

ప్రజాశక్తి - గూడూరు టౌన్, యంత్రాంగం

ఏ.పి.మున్సిపల్ వర్కర్స్ అండ్ ఎంప్లాయిస్ యూనియన్ (సి.ఐ.టి.యు) ఆధ్వర్యంలో రాష్ట్ర కమిటి ఇచ్చిన పిలుపుమేరకు తిరుపతి జిల్లా గూడూరులో మంగళవారానికి మున్సిపల్ పారిశుద్య కార్మికుల నిరవధిక సమ్మె "8వ రోజుకు" చేరుకుంది. సమ్మె శిబిరం నుంచి టవర్‌క్లాక్ సెంటర్ వరకూ అర్ధనగ్న ప్రదర్శన నిర్వహించారు. అంబేద్కర్ విగ్రహానికి వినతిపత్రం సమర్పించారు. మున్సిపల్ రాష్ట్ర కమిటి సభ్యులు బి.గోపీనాథ్ మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం ఇచ్చిన వాగ్దానాలను వెంటనే అమలు చేయాలని, కాలయాపన చేస్తే సమ్మెను ఉధృతం చేస్తామని హెచ్చరించారు. నాయకులు బివి రమణయ్య, జోగి శివకుమార్, బి.రమేష్, ధారా కోటేశ్వరరావు, పెంచల ప్రసాద్, ఎం.సంపూర్ణమ్మ, సుబ్బమ్మ, పెంచలమ్మ తదితరులు పాల్గొన్నారు.

– సూళ్లూరుపేటలో సిఐటియు జిల్లా నాయకులు ఎ.పుల్లయ్య సంఘీభావం ప్రకటించారు. కనీస వేతనం 26వేలు, గ్రాడ్యుటీపై ప్రభుత్వం ప్రకటన చేయాలని డిమాండ్ చేశారు. అధికారులు అక్కడక్కడ పోటీ కార్మికులను దింపుతామని హెచ్చరించడం సబబు కాదన్నారు. కౌన్సిలర్లు, ప్రజలు అర్థం చేసుకుని సహకరించాలని కోరారు. కె.సాంబశివయ్య, సిహెచ్ సుధాకర్‌రావు, శామ్యూల్ పాల్గొన్నారు.



నాయుడుపేటలో..

– నాయుడుపేటలో మున్సిపల్‌కార్యాలయం నుంచి కార్మికులు అర్ధనగ్నంగా బస్టాండ్ వరకూ నిర్వహించారు. సిఐటియు జిల్లా నాయకులు చాపల వెంకటేశ్వర్లు మాట్లాడుతూ సమ్మె చేపట్టి ఎనిమిది రోజులు గడుస్తున్నా రాష్ట్ర ప్రభుత్వం చర్చల పేరుతో సాగదీస్తోందన్నారు. మేస్త్రీలు కార్మికులపై పెత్తనం చెలాయిస్తున్నారని, ఆ వ్యవస్థను రద్దు చేయాలని డిమాండ్‌చేశారు. కరోనా అనంతరం తొలగించిన 70 మంది కార్మికులను విధుల్లోకి తీసుకోవాలన్నారు. ఆరుగురి మున్సిపల్ కార్మికులకు పిఎఫ్ డబ్బులు చెల్లించడంలో మీనమేషాలు లెక్కిస్తున్నారన్నారు. ఏడుగురికి ఆరు నెలలుగా పెండింగ్ వేతనాలు ఇవ్వలేదన్నారు. సిఐటియు మండల అధ్యక్షులు మహేష్‌బాబు, నెలవల మస్తానయ్య, తేజ, మైలారి శ్రీనివాసులు పాల్గొన్నారు.

నేటి మున్సిపల్ సమ్మెకు సిద్ధం : ఎఐటియుసి

పుత్తూరు టౌన్ : రాష్ట్రవ్యాప్తంగా మున్సిపల్ కార్మికుల సమస్యల పరిష్కారానికి ఎఐటియుసి తలపెట్టిన సమ్మెకు సిద్ధంగా ఉన్నామని యూనియన్ గౌరవాధ్యక్షులు డి.మహేష్ తెలిపారు. సిఎం హామీలు నెరవేర్చే వరకూ సమ్మె కొనసాగుతుందని చెప్పారు. యాకోబు, అంకయ్య, ప్రభాకర్ తదితరులు ఈ సమావేశంలో పాల్గొన్నారు.

వైకుంఠ దర్శన హుండీ ఆదాయం రూ.40.20 కోట్లు

ప్రజాశక్తి - తిరుమల

వైకుంఠ ఏకాదశి పర్వదినాన్ని పురస్కరించుకుని 2023, డిసెంబరు 23 నుండి 2024, జనవరి 1వ తేదీ వరకు 10 రోజుల పాటు 6.47 లక్షల మంది భక్తులకు శ్రీవారి ఆలయంలో వైకుంఠ ద్వార దర్శనం కల్పించామని టీటీడీ ఈవో ఎవి.ధర్మారెడ్డి తెలిపారు. పది రోజులకు కలిపి రూ.40.20 కోట్లు హుండీ కానుకలు అందాయన్నారు. 7,76,930 టికెట్లు, టోకెన్లు జారీ చేశామని, దాదాపు లక్ష మంది పది రోజుల్లో గైర్హాజరయ్యారని చెప్పారు. వచ్చే ఏడాది ఆబ్సెంటీస్ తగ్గించేందుకు ప్రయత్నిస్తామన్నారు.

తిరుమల అన్నమయ్య భవనంలో మంగళవారం ఈవో మీడియా సమావేశం నిర్వహించారు. భక్తులకు ఎలాంటి అసౌకర్యం లేకుండా సంతృప్తికరంగా స్వామివారి వైకుంఠ ద్వార దర్శనం కల్పించామన్నారు. చలికి ఎక్కువ సమయం వేచి ఉండకుండా టైంస్లాట్ టోకెన్లు జారీ చేశామన్నారు. 10 రోజులకు కలిపి విఐపి బ్రేక్ దర్శనానికి సంబంధించి మొత్తం 19,255 టికెట్లు జారీ చేశామని, 18,578 మంది హాజరుకాగా, 677 మంది(3.3 శాతం) గైర్హాజరయ్యారని తెలిపారు. దాతలకు బ్రేక్ దర్శనానికి సంబంధించి ఆన్‌లైన్‌లో మొత్తం 6,858 టికెట్లు బుక్ చేసుకున్నారని, 6,388 మంది హాజరుకాగా, 470 మంది(7 శాతం) గైర్హాజరయ్యారని వివరించారు. 17.81 లక్షల మంది అన్నప్రసాదాలు, 35.60 లక్షల మంది లడ్డూ ప్రసాదాలు స్వీకరించారని, 2.14 లక్షల మంది భక్తులు తలనీలాలు సమర్పించారని ఈవో తెలియజేశారు. అలిపిరి పాదాల మండపం వద్ద రాతిమండపం కూలిపోయే స్థితికి చేరుకుందన్నారు. అలిపిరి నడకమార్గంలో ఏర్పాటుచేసిన ట్రాప్ కెమెరాల ద్వారా చిరుత, ఎలుగుబంటి సంచారాన్ని గుర్తించినపుడు వెంటనే భక్తులను అప్రమత్తం చేసి తగిన చర్యలు తీసుకుంటున్నామని తెలిపారు. రాష్ట్ర అటవీశాఖకు రూ.3.5 కోట్లు అందించామని, దీంతో అత్యాధునిక ట్రాప్ కెమెరాల కొనుగోలుతో పాటు ఇతర చర్యలు చేపడతారని చెప్పారు. మీడియా సమావేశంలో శ్రీవారి ఆలయ డెప్యూటీ ఈవో లోకనాథం, విజివో నందకిషోర్, క్యాటరింగ్ ప్రత్యేకాధికారి శాస్త్రి పాల్గొన్నారు.

'స్పందన' సమస్యలు పరిష్కరించాలి : కమిషనర్

ప్రజాశక్తి - తిరుపతి టౌన్

జగనన్న స్పందన కార్యక్రమానికి వస్తున్న ఫిర్యాదులను వెంటనే పరిష్కరించాలని కమిషనర్ హరిత ఆదేశించారు. కార్పొరేషన్ పరిధిలో ఫిర్యాదులు పెండింగ్ ఉండరాదన్నారు. వైఎస్ఆర్ పింఛన్ కానుక ఉత్సవాలను బుధవారం ప్రారంభిస్తారని, ఈనెల 8 వరకు నిర్వహించాలన్నారు. బుధవారం జీవకోనలో పింఛన్ కానుక ఉత్సవాలకు లబ్దిదారులను ఆహ్వానించాలన్నారు. ఈ సమావేశంలో డిప్యూటీ కమిషనర్ చంద్రమౌళీశ్వర్ రెడ్డి, ఎస్.ఈ మోహన్, ఎంఈలు చంద్రశేఖర్, వెంకట్రామిరెడ్డి, రెవెన్యూ అధికారి సేతుమాధవ్, హెల్త్ ఆఫీసర్ డాక్టర్ యువ అన్వేష్ రెడ్డి పాల్గొన్నారు.

ఎస్‌టియు క్యాలెండర్ ఆవిష్కరించిన కలెక్టర్

తిరుపతి టౌన్ : రాష్ట్రోపాధ్యాయ సంఘం 2024 వ సంవత్సరం నూతన డైరీ, క్యాలెండర్‌ను తిరుపతి జిల్లా కలెక్టర్ కె.వెంకట రమణారెడ్డి ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నూతన సంవత్సరంలో ఉపాధ్యాయులు ప్రభుత్వ పాఠశాలలను బలోపేతం చేసి విద్యార్థుల్లో విద్యా ప్రమాణాలు పెంపునకు కషిచేసి తిరుపతి జిల్లాను మొదటి స్థానంలో నిలపాలని కోరారు. ఈ కార్యక్రమంలో ఎస్టియు నాయకులు గాజుల నాగేశ్వరరావు, మునికష్ణ నాయుడు, జగన్నాథం, వేణు ,హరి ప్రసాద్ రెడ్డి పాల్గొన్నారు.



అధిక యూరియాతో అనర్థం

వరిసాగులో వృథా ఖర్చు వద్దు

ప్రజాశక్తి - తిరుపతి టౌన్

వరి పైరు బాగా పెరగడానికి, అధిక పిలకలతో దుబ్బు చేయడానికి, వెన్నులు బాగా రావడానికి నత్రజని చాలా అవసరం. నత్రజని ఎరువు(యూరియా)ను దుక్కిలో పిలకలు పెట్టే దశలో, చిరుపొట్ట దశలో రకాన్ని బట్టి ఎకరాకు ఒకసారికి 35 నుంచి 45 కిలోలు వేయడానికి సిఫారసు చేస్తారు. కొందరు రైతులు పిలకల దశలో (నాటిన 2 నుంచి 3 వారాల మధ్య) సిఫార్సు చేసిన మోతాదు కంటే అధికంగా (ఎకరారు 2 బస్తాల వరకు) వేస్తున్నారు. ఈ దశలో అధికంగా యూరియా వాడకం వల్ల పైరుకు లాభంకంటే నష్టమే ఎక్కువ జరుగుతుంది. పైరు విపరీతంగా పెరిగిపోవడం, ముదురు ఆకుపచ్చరంగుకు మారి చీడలకు అధికంగా గురికావడం జరుగుతుంది. పైరుకు వాడిన యూరియాలో మొక్కలు కేవలం 30 నుంచి 35 శాతమే వినియోగించుకుంటాయి. మిగతా అంతా వథాగా పోతుంది. ఈ రకంగా వథాఖర్చు, చీడల నివారణకు అధిక ఖర్చు రైతు భరించాల్సి వస్తుంది. కాబట్టి రైతులు ఈ విషయంలో జాగ్రత్త వహించాలి.

యూరియాతో గుళికల మందు కలిపి వాడొద్దు

చాలా మంది రైతులు మొదట పైపాటుగా వేసే యూరియాతోపాటు 4 నుంచి 5 కిలోల గుళికల మందును కలిపి వాడుతుంటారు. గుళికల పురుగు మందు విడిగా వేయడానికి ఖర్చవుతుందని ఇలా చేస్తుంటారు. కానీ పురుగుల నివారణకు మందు రకాన్ని బట్టి ఎకరాకు 7 నుంచి 10 కిలోల గుళికలు వేయాల్సి ఉంటుంది. కానీ యూరియాలో 4 నుంచి 5 కిలోల గుళికలు కలిపి వేస్తే.. పురుగులు చావకపోగా ఆ మందును తట్టుకునే శక్తిని సంపాదించుకుంటాయి. ఈ పురుగులపై ఇతర మందులు ఏమి వాడినా నివారించడం కష్టమవుతుంది. కాబట్టి రైతులు యూరియాతో గుళికల మందును కలిపి వాడటాన్ని మానుకోవాలి.

పైపాటుగా కాంప్లెక్సు ఎరువులు వద్దు

పిలకల దశలో వరికి వేసే యూరియాతో పాటు చాలా మంది రైతులు డి.ఏ.పి , 20-20-0 వంటి కాంప్లెక్సు ఎరువులను ఎకరాకు ఒక బస్తా చొప్పున వేస్తుంటారు. ఈ కాంప్లెక్స్ ఎరువులలో ఉండే భాస్వరం కేవలం 20 నుంచి 25 శాతం మాత్రమే మొక్కలకు అందుతుంది. మిగతాది అంతా భూమిలో మొక్కలకు అందని స్థితిలో మారిపోతుంది. వాస్తవంగా చెప్పాలంటే ఈ కాంప్లెక్స్ ఎరువులపై పెట్టే ఖర్చులో కేవలం రూ.350 నుంచి రూ.400 మాత్రమే మొక్కలకు అంది.. మిగతాది రూ.900 నుంచి రూ.1000 వరకు వథా అవుతుంది. దీనికి బదులు ప్రస్తుతం మార్కెట్‌లో అందుబాటులో ఉన్న 'నానో డి.ఏ.పి ని ఎకరాకు అర లీటరు స్ప్రే చేసుకుంటే మంచి ఫలితాలు వస్తున్నాయి. దీని ధర రూ.600గా ఉంది. అరలీటరు ఎకరాకు సరిపోతుంది.



బయో గుళికలతో జాగ్రత్త

వరిలో పైరు బాగా పెరగడానికి, పిలకలు ఎక్కువగా రావడానికి.. అనేక రకాల పిలకల గుళికలు లేదా బయో గుళికలు నేడు మార్కెట్‌లో అందుబాటులో ఉన్నాయి. వీటి ధర పాకెట్‌కు రూ.700 నుంచి రూ.900 వరకు ఉంటుంది. నాణ్యత పరంగా వీటిలో చాలా వాటికి ఎలాంటి ప్రామాణికాలు కానీ, రుజువులు కానీ లేవు. ఇలాంటి ఉత్పత్తుల వినియోగానికి రైతులు దూరంగా ఉండటమే మంచిది. వీటిపై పెట్టే ఖర్చుకు తగ్గ దిగుబడి కానీ, ఆదాయంకానీ రైతుకు ఏమీ రాదు. రైతులకు దీని వల్ల పెద్దగా ప్రయోజనం ఉండదనే విషయాన్ని అన్నదాతలు గుర్తించాలి. వీటి వాడకం విషయంలో వ్యవసాయ అధికారుల సలహా తప్పక తీసుకోండి.

మెరుగు భాస్కరయ్య, ఎడిఎ,
వ్యవసాయశాఖ జిల్లా వనరుల కేంద్రం, తిరుపతి

పేరుకే 'సిరి'పురం కాలనీ

కనీస సౌకర్యాలు 'కరువు'

ప్రజాశక్తి - తిరుపతి (మంగళం)

తిరుపతి పట్టణం సిరిపురం కాలనీ పేరుకే సిరి'పురం.. కనీస సౌకర్యాలు కరువు. ఈ కాలనీలో దాదాపు వంద కుటుంబాలు కాపురం ఉంటున్నాయి. తిరుపతి నడిబొడ్డున ఆర్టీసీ బస్టాండ్‌కు కూతవేటు దూరంలో ఈ కాలనీ ఉంది. ఈ కాలనీకి రోడ్డు సౌకర్యం ఉన్నప్పటికీ మట్టిరోడ్డు వేయడంతో కొద్దిపాటి వర్షానికే చెరువును తలపిస్తూ రాకపోకలకు ఇబ్బందిగా మారుతోంది. రోడ్డు పూర్తిగా బురదమయంగా మారి ద్విచక్రవాహనాలు సైతం పోలేని పరిస్థితి నెలకొంది. బాటసారులు నడవడానికి ఇబ్బంది పడుతూ ఒక్కోసారి జారిపడుతున్నారని స్థానికులు వాపోతున్నారు. ఈ కాలనీలో డ్రైనేజీ కాల్వలు లేవు. విద్యుత్ దీపాలు లేకపోవడంతో పలు ఇబ్బందులకు గురవుతున్నారు. బ్లిస్ హోటల్ వెనుక వైపున ఉన్న సిరిపురం కాలనీకి ఎలాంటి సౌకర్యం కల్పించకపోవడం బాధాకరమని స్థానికులు వాపోతున్నారు. తిరుపతి నగరాన్ని సుందరంగా తీర్చిదిద్దుతున్న అధికారులకు ఈ కాలనీ దుస్థితి కనిపించదా అని ప్రశ్నిస్తున్నారు.



ఈ రోడ్డు వర్షం వస్తే చిత్తడి చిత్తడే..

అవినీతి రహిత పాలనకు సిద్ధం కావాలి: ఆప్

ప్రజాశక్తి-బుచ్చినాయుడు కండ్రిగ: ఢిల్లీ, పంజాబ్ తరహాలో ఆంధ్ర ప్రదేశ్ లోనూ అవినీతి రహిత పాలనకు సిద్ధం కావాలని ఆమ్ ఆద్మీ సత్యవేడు నియోజకవర్గ కన్వీనర్ మొరుంపల్లి నందిని పిలుపు నిచ్చారు. సామాన్యుడి శంఖారావం ప్రజా చైతన్య యాత్రలో భాగంగా ఆరో రోజు మంగళవారం బుచ్చినాయుడు కండ్రిగ పట్టణంలో పర్యటించారు. ఈ సందర్భంగా ఆమె వివిధ వర్గాల ప్రజలను కలుసుకుని, ఆమ్ ఆద్మీ పాలన ఈ రాష్ట్రంలోనూ రావాల్సిన ఆవశ్యకతను వివరించారు. అవినీతి రహిత పాలనతోనే ప్రభుత్వం అప్పుల నుండి బయట పడుతుందన్నారు. 90 శాతం గ్రామాల్లో కనీస వసతులు కూడా కరువైనప్పటికీ నాయకులు పట్టించుకోవడంలేదన్నారు. ఓటుకు నోటు పంచడంతోనే వారి అవినీతి మొదలవుతుందని విమర్శించారు. ఈ కార్యక్రమంలో జిల్లా ప్రధాన కార్యదర్శి బొప్పన శ్రీనివాస్, మండల కన్వీనర్ బాలరాజు, గీతిక పాల్గొన్నారు.

'జగనన్న ఆరోగ్య సురక్ష' ప్రారంభం

ప్రజాశక్తి- నారాయణవనం: మండలంలోని సముదాయం సచివాలయం విలేజ్ హెల్త్ క్లినిక్‌లో జగనన్న ఆరోగ్య సురక్షను మంగళవారం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి తిరుపతి నుండి స్పెషల్ డాక్టర్ గైనకాలజిస్టు, జనరల్ డాక్టర్ ఒకరు, నారాయణవనం పీహెచ్‌సి డాక్టర్ దర్శిత రాజ్, డాక్టర్ రాఘసుధ, కంటి వెలుగులో అరవింద్ హాస్పిటల్ వారు పాల్గొన్నారు. సాధారణ జబ్బులకు వైద్యం అందించారు. డయాబెటిక్, హై బీపీ , షుగర్ రోగులకు మందులు అందించారు. హెల్త్ అవేర్‌నెస్ నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఎంపీడీఓ కృష్ణమూర్తి, సచివాలయ పరిధి సర్పంచ్ సుబ్రహ్మణ్యం రెడ్డి, పీహెచ్ సిబ్బంది, సముదాయం సచివాలయం సిబ్బంది పాల్గొన్నారు.



గుర్తు తెలియని కార్మికుడి మృతదేహానికి అంత్యక్రియలు నిర్వహిస్తున్న తోటి కార్మికులు

భవన నిర్మాణ కార్మికుడికి అంత్యక్రియలు

మానవత్వం చాటుకున్న తోటి కార్మికులు

ప్రజాశక్తి-తిరుపతి(మంగళం): గత ఏడాది డిసెంబర్ 28న మంచాల వీధిలో గోడ కూలిన సంఘటనలో నరసింహులు, నారాయణ అనే వ్యక్తులు అక్కడికక్కడే మృతి చెందిన విషయం విదితమే. అయితే నారాయణ మృతి వార్త తెలుసుకున్న కుటుంబ సభ్యులు ఆ మృతదేహాన్ని తీసుకొని వారి స్వగ్రామానికి వెళ్లి అక్కడే అంత్యక్రియలు నిర్వహించారు. మరొక మృతుడు నరసింహులు ఎక్కడి వాడో ఆచూకీ తెలియకపోవడంతో మంగళవారం అఖిల భారతీ య భవన నిర్మాణ కార్మికుల సంఘం వ్యవస్థాపక అధ్యక్షులు సుబ్బు యాదవ్ ఆధ్వర్యంలో తిరుపతి నగర పరిధిలోని గోవింద ధామంలో భవన నిర్మాణ కార్మికులు కలిసి అంత్యక్రియలు నిర్వహించారు. గోడ కూలిన ఘటనలో తీవ్ర గాయాల పాలైన ఖాదర్ బాషా ఆసుపత్రిలో చికిత్స పొందుతున్నాడు. గుర్తు తెలియని భవన నిర్మాణ కార్మికుడికి అంత్యక్రియలు చేసి మానవత్వం చాటుకున్నారు.

చేనేత వర్గాలకు రాజకీయ ప్రాధాన్యం ఇవ్వండి: రెడ్డిబాబు

ప్రజాశక్తి-తిరుపతి(మంగళం): రాష్ట్ర వ్యాప్తంగా చేనేత కులాలు ఎక్కువగా ఉన్న నియోజకవర్గాల్లో ప్రజాదరణ కలిగిన చేనేత సామాజిక వర్గాలకు ఎంపీ, ఎమ్మెల్యే సీట్లను కేటాయించాలని రాష్ట్ర వ్యాప్తంగా ఉన్న గుర్తింపు కలిగిన రాజకీయ పార్టీలను జాతీయ చేనేత ఐక్యవేదిక రాష్ట్ర అధ్యక్షులు సుంకర చిన్నరెడ్డిబాబు కోరారు. చేనేతలకు రాజకీయ ప్రాధాన్యం కల్పించడం వల్ల చేనేత సామాజిక వర్గానికి చెందిన వారు అభివృద్ధి చెందే అవకాశం ఉంటుందన్నారు. ఈ దిశగా రాజకీయ పార్టీలు సమాలోచన చేసి సీట్ల కేటాయింపు చేయాలని కోరారు.



డెయిరీలు, కేలెండర్లు ఆవిష్కరిస్తున్న యుటిఎఫ్ నాయకులు

యుటిఎఫ్ డైరీలు కేలెండర్ల ఆవిష్కరణ

ప్రజాశక్తి-బుచ్చినాయుడు కండ్రిగ: మండల విద్యా శాఖ అధికారి 1, మండల విద్యాశాఖ అధికారి 2 లను యుటిఎఫ్ నాయకులు మంగళవారం కలిసివారి చేతుల మీదుగా యుటిఎఫ్ డైరీలు క్యాలెండర్లను ఆవిష్కరించారు. జిల్లా కేంద్రంలో చేపట్టనున్న ధర్నాను జయప్రదం చేయాలని ఆ సంఘం మండల అధ్యక్షులు ఈశ్వరయ్య కోరారు. ఉపాధ్యాయులు సెలవు పెట్టి హాజరుకావాలని సూచించారు. మండల విద్యాశాఖ అధికారితో రేపు ధర్నాకు వెళ్లే ఉపాధ్యాయులకు ఇబ్బంది కలగకుండా సెలవులు ఇప్పించాలని కోరారు. ఇందుకు ఎంఈఓ సానుకూలంగా స్పందించి పాఠశాలలు మూతపడకుండా సెలవు తీసుకోవాలని సూచించారు. యుటిఎఫ్ బిఎన్ కండ్రిగ మండల శాఖ ఈ కార్యక్రమంలో పాల్గొన్న ఉపాధ్యాయిని ఉపాధ్యాయులు అందరికీ ధన్యవాదాలు తెలిపారు. ఈ కార్యక్రమంలో యుటిఎఫ్ జిల్లా కార్యదర్శి వెంకట కృష్ణయ్య, జిల్లా ఆడిట్ కమిటీ సభ్యురాలు దీపిక, మండల గౌరవ అధ్యక్షులు రవీందర్ రెడ్డి, అధ్యక్షులు ఈశ్వరయ్య , ప్రధాన కార్యదర్శి రమేష్, కోశాధికారి సతీష్ కుమార్, మహిళా కార్యదర్శి జయంతి, సహా అధ్యక్షులు చలముని, జిల్లా కౌన్సిలర్లు వాసుదేవరావు, కోదండ రావు పాల్గొన్నారు.

నిరుపయోగంగా జంతువధశాల

ప్రజాశక్తి -వెంకటగిరి రూరల్ : వెంకటగిరి మున్సిపాల్టీ పరిధిలోని 14వ వార్డు నర్సింగరావు వీధిలో వున్న జంతువధశాల నిరుపయోగంగా మారింది. పట్టణ ప్రజల ఆరోగ్యాన్ని దృష్టిలో వుంచుకుని మాంసం విక్రయదారులకు సౌకర్యంగా, ప్రజల ఆరోగ్య రీత్యా జీవాలు పొట్టేళ్లు, మేక పోతులను పశు వైద్యుల ద్వారా పరీక్షించి వధించి ప్రజలకు విక్రయించేందుకు మున్సిపాల్టీ వారు 35 లక్షల రూపాయల ప్రభుత్వ నిధులతో భవనాన్ని నిర్మించారు. అధికారుల నిర్లక్ష్యంతో ప్రస్తుతం ఈ భవనం నిరుపయోగంగా వుంది. మాంసం వ్యాపారుల స్వలాభం కోసం ఎవరికి వారు తమతమ దుకాణాల ముందు జీవాల మాంసం విక్రయి స్తున్నారు. ఈ కారణంగా జంతు వధశాల ను ఉపయోగించడం లేదని ప్రజలు వాపోతున్నారు. జీవాలను వైద్యుల వద్ద పరీక్షించి ఈ భవనంలో ప్రజలకు ఆరోగ్యకరమైన మాంసాన్ని విక్రయించే వారని, కానీ ఇప్పుడు అధికారుల అలసత్వం, వ్యాపారస్తులతో కుమ్మక్కవడంతో ఈ భవనాన్ని సద్వినియోగం చేసుకోకుండా వదిలేశారని పట్టణ ప్రజలు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. అధికారులు స్పందించి మళ్లీ దీన్ని ఉపయోగంలోకి తీసుకురావాలని, వైద్యులు పరీక్షించిన తరువాతే మాంసం విక్రయించేందుకు చర్యలు చేపట్టాలని పట్టణ ప్రజలు కోరుతున్నారు.

దుస్తుల పంపిణీ

ప్రజాశక్తి - గూడూరు టౌన్ : గూడూరు లోని ప్రగతి సేవా సంస్థ వార్షికోత్సవంలో భాగంగా మంగళవారం గూడూరులోని బాలాజీ నగర్‌లోని ఆ సంస్థ కార్యాలయంలో వాకాటి రామ్మోహన్ రావు కుమార్తె జాహ్నవి పుట్టినరోజు సందర్భంగా 50 మందికి చీరలు పంపిణీ చేశారు. ఈ నెల 2వ తేదీ నుంచి 12 తేదీ వరకు 'ప్రగతి' వారోత్సవాలు ఘనంగా నిర్వహిస్తామని ఆ క్లబ్ అధ్యక్షుడు కడివేటి చంద్ర శేఖర్ పేర్కొన్నారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన రోటరీ క్లబ్ అసిస్టెంట్ గవర్నర్ మయూరి శ్యామ్ యాదవ్ చేతుల మీదుగా దుస్తులు పంపిణీ చేశారు.

ఆలయ పవిత్రతను కాపాడండి

ముక్కంటి ఆలయ ధర్మకర్తల మండలి అధ్యక్షులు అంజూరు తారక శ్రీనివాసులు

ప్రజాశక్తి-శ్రీకాళహస్తి : ముక్కంటి ఆలయ పవిత్రతను కాపాడాలని ధర్మకర్తల మండలి అధ్యక్షులు అంజూరు తారక శ్రీనివాసులు కోరారు. ముక్కంటి ఆలయ పరిపాలన భవనం సమావేశపు మందిరంలో మంగళవారం ఆయన విలేకరులతో మాట్లాడారు. రాజకీయాల కోసం ఆలయాన్ని వేదికగా చేసుకుని అసత్య ఆరోపణలు చేయడం న్యాయం కాదన్నారు. ఆలయంలో పురాతన రాతి మండపాలు ఏవి తొలగించలేదన్నారు. 1956లో పోటుకు అనుబంధంగా ఏర్పాటు చేసుకున్న స్టోర్ రూమ్ సిమెంట్ కట్టడం శిథిలావస్థకు చేరుకోవడంతో దాన్ని తొలగించి అక్కడ ఆశీర్వాద మండపం తీర్చిదిద్దుతున్నామని తెలిపారు. టీడీపీ నియోజకవర్గ ఇన్చార్జి బొజ్జల సుధీర్ రెడ్డి వాస్తవాలకు విరుద్ధంగా పురాతన కట్టడాలు కూల్చివేసినట్టు మాట్లాడడం తగదన్నారు. నిబంధనలకు విరుద్ధంగా ఆలయం లోపలికి ఫోన్లు తీసుకెళ్లి సెల్ఫీలు చిత్రీకరించు కోవడం తగదని, దీనిపై సంబంధిత అధికారులపై శాఖాపరమైన చర్యలు తీసుకుంటామన్నారు. అధికారుల వివరణ తర్వాత నిబంధనలు విరుద్ధంగా వ్యవహరించిన సుధీర్ రెడ్డి పై తగిన చర్యలు తీసుకోనున్నట్లు తెలిపారు. రెండేళ్ల క్రితమే పోటు వద్ద ఉన్న స్టోర్ రూమ్ స్థానంలో ఆశీర్వాద మండపం చేయాలని ధర్మకర్తల మండలి తీర్మానించిందన్నారు. స్వామి డిపాజిట్లు రూ.236 కోట్లు ఉందని... వాస్తవాలు తెలుసుకొని సుధీర్ రెడ్డి మాట్లాడాలని సూచించారు. రాజకీయాలకు అతీతంగా ఆలయ ప్రతిష్ట పెంచే విధంగా వ్యవహరించాలని కోరారు. ఈ సమావేశంలో ధర్మకర్త మండలి సభ్యురాలు సుమతి, అసిస్టెంట్ కమిషనర్ మల్లికార్జున ప్రసాద్, ఈఈ నూకరత్నం, డిప్యూటీ ఈవో వెంకటసుబ్బయ్య, ధనపాల్, ఆలయ ప్రధాన అర్చకులు సంబంధం గురుకుల్, కరుణాకర్ గురుకుల్, తదితరులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న ధర్మకర్తల మండలి అధ్యక్షులు అంజూరు తారక శ్రీనివాసులు

ప్రశాంత ఎన్నికలకు ముందస్తు చర్యలు: ఎస్ఐ



పోలింగ్ స్టేషన్‌లో సౌకర్యాలను అడిగి తెలుసుకుంటున్న ఎస్ఐ మనోజ్‌కుమార్

ప్రజాశక్తి - గూడూరు టౌన్ : గూడూరు మండల పరిధిలో సార్వత్రిక ఎన్నికలు ప్రశాంతమైన వాతావరణంలో నిర్వహించేందుకు ముందస్తు చర్యలు తీసు కుంటున్నామని ఇందులో భాగంగానే గూడూరు మండలంలో పలు గ్రామాలలో పోలింగ్ కేంద్రాలను పరిశీలించామని గూడూరు రూరల్ ఎస్ఐ మనోజ్ కుమార్ పేర్కొన్నారు. గూడూరు మండల పరిధిలోని వేములపాలెం రాములపాలెం గ్రామాలలోని పోలింగ్ కేంద్రాలను ఎస్ఐ మనోజ్ కుమార్ మంగళవారం తన సిబ్బందితో కలిసి పరిశీలించారు. ఈ సందర్భంగా మనోజ్ కుమార్ మాట్లాడుతూ అతి త్వరలో ఎన్నికలు రానున్న దృష్ట్యా జిల్లా ఎస్పీ పరమేశ్వర్ రెడ్డి ఆదేశాల మేరకు మండలంలోని సమస్యాత్మక మైన పోలింగ్ కేంద్రాలను పరిశీలించామన్నారు. పోలింగ్ కేంద్రాలలో అన్ని వసతులు ఉన్నాయా? లేవా? అని పోలింగ్ కేంద్రాలకు కాంపౌండ్ వాల్ తో పాటు ర్యాంపుల వంటివి ఉన్నాయా..లేవా? అని పరిశీలించడంతో పాటు ఏ పోలింగ్ కేంద్రాల వద్ద గొడవలు వంటి అవాంఛనీయ సంఘటనలకు పాల్పడే అవకాశాలు ఉన్నాయి?' అనే వాటిని పరిశీలించామని పేర్కొన్నారు.

విద్యుత్ షార్ట్ సర్క్యూట్‌తో పూరిల్లు దగ్ధం

ప్రజాశక్తి -దొరవారిసత్రం: నిరుపేద గిరిజనులు నివాస ముంటున్న పూరిల్లు విద్యుత్ షార్ట్ సర్క్యూట్ తో కాలి బూడిద అయిన సంఘటన మండల పరిధి లోని పూల తోట గిరిజన కాలనీలో మంగళ వారం వెలుగు లోకి వచ్చింది. బాధితుల కథనం మేరకు మానికల శ్రీనివాసు లు పేద రికంలో కూలి పనుల పైనే ఆధారపడి జీవిస్తున్నాడు. ఇల్లు నిర్మించుకోలేక పూరి ఇంటిలోనే నివసిస్తున్నాడు. భార్యతో కలిసి కూలి పనికి వెళ్లాడు. అదే సమయంలో విద్యుత్ షార్ట్ సర్క్యూట్ కారణంగా నిప్పు రవ్వలు ఎగిసిపడి పూరిల్లు కాలి బూడిదయింది. అందులో తన కూలి పని చేసి కూడ పెట్టుకున్న పదివేల రూపాయల నగదు, చిన్నపాటి బంగారు కమ్మలు తోపాటు, ఫ్రిజ్, బీరువా, దుస్తులు, వంట సామగ్రి కాలి బూడిదైందని ఆవేదన వ్యక్తం చేశాడు. నష్టపోయిన ఆ కుటుంబాన్ని ఆదుకోవాలని గ్రామస్తులు అధికారులను కోరుతున్నారు.



కాలి బూడిదైన వస్తు సామగ్రి, కట్టుబట్టలతో మిగిలిన కుటుంబం

అట్టహాసంగా క్రీడలు ప్రారంభం

ప్రజాశక్తి- నారాయణవనం: నారాయణవనం మండలం కసిమిట్ట సచివాలయ పరిధిలో 'ఆడుదాం ఆంధ్ర' క్రీడా పోటీలను నారాయణవనం కసిమిట్ట పాఠశాల ప్రాంగణంలో గ్రామ పంచాయతీ సెక్రటరీ కిరణ్ మంగళ వారం అట్టహాసంగా ప్రారంభించారు.ఈ సందర్భంగా జడ్పిటిసి కోనేటి సుమన్ కుమార్ మాట్లాడుతూ క్రీడా రంగాన్ని బలోపేతం చేయాలనే ఉద్దేశంతో ప్రభుత్వం 'ఆడుదాం ఆంధ్ర' క్రీడా పోటీలకు శ్రీకారం చుట్టిందన్నారు. ఈ పోటీల వల్ల యువతలో అంతర్గతంగా దాగి ఉన్న క్రీడ ప్రతిభను వెలికి వస్తుందన్నారు. ముఖ్యమంత్రి జగన్మోహన్ రెడ్డి శ్రీకారం చుట్టిన ఆడుదాం ఆంధ్ర క్రీడా పోటీలను క్రీడాకారులందరూ సద్వినియోగం చేసుకొని క్రీడల్లో రాణించాలన్నారు. క్రీడ రంగంలో ఇతర రాష్ట్రాలతో పోటీ పడే విధంగా క్రీడాకారులు వారి నైపుణ్యాన్ని పెంపొందించుకోవాలన్నారు. గ్రామీణ క్రీడా కారులు వారి సత్తాను సాటి మండలానికి గుర్తింపు తీసుకు రావాలన్నారు. ఇప్పటికే క్రీడాకారులకు అవసరమైన క్రీడా పరికరాలను ప్రతి సచివాలయానికి పంపిణీ చేశామని తెలిపారు. అంతకుముందు క్రీడాకారులకు అవసరమైన క్రీడా పరికరాలను సర్పంచులు పంపిణీ చేశారు. కబడ్డీ, వాలీబాల్, ఖోఖో, బ్యాడ్మింటన్ తదితర క్రీడా పోటీలు నిర్వహించారు. ఇందుకు సంబంధించి 17 టీములు పాల్గొన్నట్లు పంచాయతీ సెక్రెటరీ కిరణ్ పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో సచివాలయ సిబ్బంది, ఎంఈఓ ప్రభాకర్ రాజు, గోవిందస్వామి, మండల కన్వీనర్ సొరకాయలు, హెచ్ఎం శశికళ, సులోచన, ఛైర్మన్ సుబ్రహ్మణ్యం, సర్పంచ్ మురుగేష్, అయ్యప్ప, పిటి మాస్టర్ సురేష్, పలువురు క్రీడాకారులు, గ్రామస్తులు పాల్గొన్నారు.



క్రీడల పోటీలు ప్రారంభిస్తున్న జడ్‌పిటిసి సుమన్‌కుమార్

ఓజిలి : గ్రామీణ యువ క్రీడాకారులు తమ నైపుణ్యంతో క్రీడల్లో రాణించాలని వైసిపి నాయకులు పిండుకూరు మధుసూదన్ రెడ్డి పేర్కొన్నారు. మండల పరిధిలోని మాచవరం సచివాలయంలో 'ఆడుదాం ఆంధ్ర'ను మంగళవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గ్రామ స్థాయి నుండి ఆరోగ్యకరమైన జీవనశైలిని ప్రోత్సహించేందుకు క్రీడాకారుల్లో దాగి ఉన్న ప్రతిభను వెలికి తీసి జాతీయ స్థాయిలో పోటీపడేలా తీర్చిదిద్దేందుకు 'ఆడుదాం ఆంధ్ర'ను ప్రారంభించారన్నారు. ఈ కార్యక్రమంలో మాచవరం సర్పంచ్ పిండు కూరు మౌనిక రెడ్డి, కుందాం సర్పంచ్ ఎద్దుల కనక దుర్గ భవాని, ముమ్మాయిపాలెం సర్పంచ్ శంకు సుజాత, తిరుమలపూడి సర్పంచ్ యాకసిరి గోపాలయ్య, పంచాయతీ కార్యదర్శి పెద్ద మస్తానయ్య, పిఈటిలు, వాలంటీర్లు పాల్గొన్నారు.

ప్రధానోపాధ్యాయురాలకు ఘన సన్మానం

ప్రజాశక్తి - రామచంద్రాపురం: మండలంలోని కమ్మకండ్రిగ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల ప్రధానోపాధ్యాయురాలు వాగ్దేవికి మంగళవారం భాషోపాధ్యాయ సంస్థ జిల్లా అధ్యక్షులు దొడ్డ ఉమామహేశ్వరరావు ఆధ్వర్యంలో పుష్పగుచ్ఛం అందించి దుశ్శాలవతో ఘనంగా సన్మానించి నూతన సంవత్సర శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా ప్రధానోపాధ్యాయులు వాగ్దేవి మాట్లాడుతూ ఉపాధ్యాయులు విద్యార్థులపై ప్రత్యేక శ్రద్ధ తీసుకుని నిరంతరం నాణ్యత మైన విద్యనందించి ఉత్తమ విద్యార్థులుగా తీర్చిదిద్దాలని పాఠశాలకు మంచి పేరు తీసుకురావాలని కోరారు. .మార్చి నెలలో జరిగే పదవతరగతి పరీక్షలపై ప్రతి ఒక్కరూ ప్రత్యేక దృష్టి సారించి మెరుగైన ఫలితాలు సాధనకు కృషి చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర భాషోపాధ్యాయ సంస్థ నేతలు విశ్వనాథం,జె సుబ్రహ్మణ్యం, జ్యోతి పాల్గొన్నారు.

పురాతన గోడ కూల్చిన వారిపై చర్యలు తీసుకోవాలి

టిడిపి ఇన్‌ఛార్జి సుధీర్‌రెడ్డి

ప్రజాశక్తి-శ్రీకాళహస్తి: శ్రీకాళహస్తీశ్వర ఆలయంలో మృత్యుంజయస్వామి ఆలయం పక్కనే ఉన్న పురాతన గోడ కూల్చి వేసిన వారిపై చట్ట ప్రకారం చర్యలు తీసుకోవాలని టిడిపి శ్రీకాళహస్తి నియోజకవర్గం ఇన్ ఛార్జి బొజ్జల వెంకట సుధీర్ రెడ్డి డిమాండు చేశారు. శ్రీకాళహస్తీశ్వర ఆలయంలో మృత్యుంజయ స్వామి ఆలయం పక్కన కూల్చి వేసిన పురాతన గోడను మంగళవారం ఆయన టిడిపి నేతలతో కలసి పరిశీలించారు. అనంతరం ఆయన మీడియాతో మాట్లాడుతూ ప్రముఖులకు ఆశీర్వచనం ఇవ్వడానికి స్థలం లేదనే సాకుతో ఎన్నో వందల ఏళ్ల కిందట రాజులు నిర్మించిన గోడను దేవదాయశాఖ అనుమతి లేకుండా కూల్చి వేయడం బాధాకరమన్నారు. ఇలా చేయడం వలన హిందువుల మనో భావాలు దెబ్బతింటాయన్నారు. శ్రీకాళహస్తి ఎమ్మెల్యే బియ్యపు మధుసూదనరెడ్డి ఒత్తిళ్లతో ముక్కంటి ఆలయంలో ఆగమ శాస్త్ర నియమాలకు విరుద్ధంగా అధికారులు నిర్ణయాలు తీసుకుంటూ విమర్శల పాలవుతున్నారన్నారు. ఇలా చేసే వారిపై దేవదాయ చట్ట ప్రకారం చర్యలు తీసుకోవాలని ఆయన డిమాండు చేశారు. వైసీపీ అధికారంలోకి వచ్చిన తరువాత శ్రీకాళహస్తీశ్వర ఆలయంలో అక్రమార్కులకు, అర్హత లేని వారికి అందలం వేసి దేవుని సొమ్ము దోచుకుంటున్నారని ఆరోపించారు. టిడిపి అధికారంలోకి వస్తే ఇలాంటి వారిపై శాఖాపరమైన చర్యలు తీసుకుంటామని ఆయన హెచ్చరించారు. వైసీపీ అధికారంలోకి వచ్చిన తరువాత నిర్మాణాల పేరుతో ముక్కంటి ఆలయ నిల్వ సొమ్ము ఖాళీ చేస్తున్నారని ఆయన ఆవేదన వ్యక్తం చేశారు. ఆలయ నిర్మాణాల బాధ్యత ఎలక్ట్రీషియన్లకు కాంట్రాక్టు ఇవ్వడం ఏమిటని ఆయన ప్రశ్నించారు. కమీషన్లకు కక్కుర్తి పడి ఇలా చేస్తున్నారని బొజ్జల వెంకట సుధీర్ రెడ్డి ఆరోపించారు. టీడీపీ అధికారంలోకి వచ్చిన తరువాత ఈ అక్రమార్కులపై సమగ్ర విచారణ జరిపి బాధ్యులపై చర్యలు తీసుకుంటామన్నారు. సుమారు రెండేళ్లుగా ముక్కంటి ఆలయం ఇన్ ఛార్జిల పాలనలో ఉండటం బాధాకరమన్నారు. దేవదాయశాఖ ఉన్నతాధికారులు స్పందించి ముక్కంటి ఆలయానికి రెగ్యులర్ ఈవోను నియమించాలని ఆయన డిమాండు చేశారు. ఈ కార్యక్రమంలో టీడీపీ నేతలు గుమ్మడిపూడి దశరథాచారి, కంఠా రమేష్, చక్రాల ఉష, మిన్నల రవి, సుబ్బయ్య, అస్మత్, వజ్రం కిషోర్, మునిరాజా యాదవ్, దుర్గా ప్రసాద్ పాల్గొన్నారు.

పేదలకు దుప్పట్లు పంపిణీ

ప్రజాశక్తి-ఎస్ఆర్ పురం: ఎనర్జియా లైఫ్ సైన్సెస్ ట్రస్ట్ ద్వారా పేదలకు, వృద్ధులకు దుప్పట్లు, చీరలు, దోవతీలు ఆ ట్రస్ట్ అధినేత రాజీవ్ చంద్రబోస్, నవీన్ ఆధ్వర్యంలో అందజేశారు. మండలంలోని కటికపల్లి పంచాయతీలో సుమారు 300మందికి దుప్పట్లు పంపిణీ చేశారు. ముఖ్య అతిథి సీఎంసీ చీలాపల్లి డాక్టర్ జీవరత్నం దంపతుల చేతుల మీదుగా వితరణ చేశారు. అన్నదాన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రతి ఏటా ఎనర్జియా లైఫ్ సైన్సెస్ ట్రస్ట్ ద్వారా సేవా కార్యక్రమాలు నిర్వహిస్తున్నట్లు చెప్పారు. కార్యక్రమంలో వేలూరు సిఎంసి పాస్టర్లు రెవరెండ్ విజయ్‌కుమార్, కొత్తపల్లి గురు మండలం పాస్టర్ రెవరెండ్ ఆబెల్ ప్రభు, శ్రీకాళహస్తి పాస్టర్ రెవరెండ్ వినోద్ కుమార్, ముఖ్య అతిథి సీఎంసీ చిలాపల్లి డాక్టర్ జీవరత్నం దంపతులు, రాజీవ్ చంద్రబోస్, నవీన్ తదితరులు పాల్గొన్నారు.

క్రీడా సామగ్రి వితరణ

ప్రజాశక్తి-నగరి: ఇటీవల నిర్వహించిన జోనల్ క్రీడల్లో మండలంలోని నాగరాజకుప్పం జిల్లాపరిషత్ ఉన్నత పాఠశాల విద్యార్థులు ఉత్తమ ప్రతిభ కనబరిచారు. అన్ని క్రీడల్లోను రాణించి పాఠశాలను మొదటి స్థానంలో నిలిపారు. విద్యార్థులకు ప్రోత్సాహంగా ఉపాధ్యాయులంతా కలి సి రూ.25వేలు పోగుచేసి వారికి అవసరమైన క్రీడా సామ గ్రిని కొనుగోలు చేశారు. మంగళవారం పాఠశాలలో ఏర్పా టుచేసిన సమావేశంలో విద్యార్థులకు అందించారు. ఈ కార్యక్రమంలో పాఠశాల హెచ్ఎం మోహన్ రామ్, పురుషోత్తమాచారి, పీడీ చెన్నకేశవరెడ్డి పాల్గొన్నారు.

87 కొత్త పింఛన్లు పంపిణీ

ప్రజాశక్తి -రామచంద్రాపురం: వైయస్సార్ పెన్షన్ కానుక పథకంలో భాగంగా కొత్తగా మంజూరైన 87 మంది పింఛన్ దారులకు రూ.3 వేలు రూపాయలను తుడా ఛైర్మన్ చెవిరెడ్డి మోహిత్ రెడ్డి పంపిణీ చేశారు. మంగళవారం స్థానిక ఎంపీడీవో కార్యాలయం ఆవరణలో వైయస్సార్ పెన్షన్ కానుకను 3వేల రూపాయలకు పెంచిన సందర్భంగా లబ్ధిదారుల నడుమ పండుగ వాతావరణంలో పింఛన్లు మంజూరు పత్రాలను అందించారు. మండలంలో 87 కొత్త పింఛన్లతో పాటు 5,802 మందికి వైయస్సార్ పెన్షన్ కానుక నగదును ప్రభుత్వం అందజేసి ఆదుకుంటోందని మోహిత్ రెడ్డి పేర్కొన్నారు. అర్హులైన ప్రతి ఒక్కరికి ప్రభుత్వ సంక్షేమ పథకాలను అందజేయడమే వైసీపీ ప్రభుత్వ లక్ష్యమని ఆయన పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో ఎంపీడీవో శ్రీనివాసులు, తహశీల్దార్ చిన్న వెంకటేశ్వర్లు, సచివాలయ సిబ్బంది, స్థానిక నాయకులు లబ్ధిదారులు, తదితరులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న చెవిరెడ్డి మోహిత్‌రెడ్డి

క్రైం న్యూస్

రోడ్డు ప్రమాదంలో వ్యక్తి మృతి

ప్రజాశక్తి - తడ: రోడ్డు ప్రమాదంలో వ్యక్తి మృతి చెందిన సంఘటన మంగళవారం మండలంలో చోటుచేసుకుంది. పోలీసుల కథనం మేరకు. బూదూరు తమిళ సెల్వం (28) సూళ్లూరుపేట లోని వట్రపాళెంలో నివాసం వుంటున్నాడు. సోమవారం స్నేహితుల బైక్ తీసుకుని గుమ్మిడి పూండికి వెళ్లిరావాలని చెప్పి వెళ్లాడు. తిరిగి వచ్చే సమయంలో అర్ధరాత్రి సమయంలో బైక్ స్కిడ్ అయి డివైడర్‌ను ఢీకొట్టి కింద పడి తలకు బలమైన గాయం అయింది. స్థానికులు చూసి తమిళనాడులోని యళావూర్‌లో వున్న హాస్పిటల్‌కు తరలించగా అప్పటికే మృతి చెందినట్లు అక్కడి డాక్టర్లు తెలిపారన్నారు. పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు. తమిళ సెల్వం గతంలో అత్యాచార కేసులో ఎ4 ముద్దాయిగా వున్నట్లు పోలీసులు తెలిపారు.



రోడ్డు ప్రమాదంలో మృతి చెందిన కొల్లేటి హరి

ఇన్నోవా ఢీకొని ఇద్దరు దుర్మరణం

ప్రజాశక్తి -ఏర్పేడు: రోడ్డుపై టీ తాగుతున్న ఇద్దరు వ్యక్తులను ఓ వాహనం ఢీకొనడంతో ఇద్దరు మృతి చెందారు. ఈ సంఘటన మంగళవారం మండలంలో చోటుచేసుకుంది. ఏర్పేడు –వెంకటగిరి మార్గం లోని చింతలపాలెం వద్ద ఉన్న చెక్ పోస్ట్ వద్ద టీ దుకాణంలో చింతలపాలెంకి చెందిన దామెర మురళి నాయుడు (50) దళితవాడకు చెందిన కొల్లేటి హరిలు టీ తాగుతుండగా ఇన్నోవా ఢీకొంది. ఈ ప్రమాదంలో మురళి నాయుడు అక్కడికక్కడే మృతి చెందగా, కొల్లేటి హరిని తిరుపతి మారుతి ఆసుపత్రికి తీసుకెళుతుండగా మార్గ మధ్యంలో మృతి చెందాడు. మురళి నాయుడుకు కుమారుడు శివ, భార్య వాణి, ఒక కుమార్తె ఉన్నారు. కొల్లేటి హరికి కొల్లేటి వెంకటేశు, సాయి బాబా అనే ఇద్దరు కుమారులు, భార్య ధనమ్మ ఉన్నారు. అనుకోకుండా ఒకే గ్రామంలో ఇద్దరూ మృతి చెందగా గ్రామంలో విషాద ఛాయలు అలముకున్నాయి. సర్పంచ్ చింత బాల ప్రసాద్ యాదవ్ అలియాస్ చిన్న మృతుల కుటుంబాలను పరామర్శించారు. ఇన్నోవాలో ప్రయాణిస్తున్న మరో వ్యక్తి తీవ్రంగా గాయపడ్డారు. ప్రాణాపాయ పరిస్థితి తప్పింది. పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

టాటా సుమో ఢీ

యువకునికి తీవ్ర గాయాలు

ప్రజాశక్తి -ఏర్పేడు: ఏర్పేడు మండలం మేర్లపాక సమీపంలో పుష్పత్ స్టీల్ ప్రైవేట్ లిమిటెడ్ దగ్గర కోనాటి నరేంద్ర (అలియాస్ నరేష్) (28) రోడ్డు దాటుతుండగా వేగంగా ఏపీ 39 టిఎల్ 0895 నంబర్ గల టాటా సుమోవాహనం ఢీకొంది. ఈ ప్రమాదంలో వ్యక్తి తలకు తీవ్ర గాయాలు అయ్యాయి. స్థానికులు వెంటనే స్పందించి గాయపడిన వ్యక్తిని ప్రభుత్వ ఏరియా హాస్పిటల్‌కు తరలించారు. డ్రైవర్ ను వివరాలు అడిగి తెలుసుకున్న పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

108 వాహనంలో ప్రసవం- తల్లీబిడ్డ క్షేమం



ప్రజాశక్తి- బుచ్చి నాయుడుకండ్రిగ: మండలంలోని వేణుగోపాలపురం పంచాయతీ చెందిన ఆనంద్ భార్య పుష్ప పురిటి నొప్పులు రావడంతో బంధువులు 108కి సమాచారం అందించారు. అంబులెన్సులో శ్రీకాళహస్తి ప్రభుత్వ ఆస్పత్రికి తీసుకొని వెళుతుండగా మార్గ మధ్యంలో 108 వాహనంలోనే పుష్ప పండంటి ఆడబిడ్డకు జన్మనిచ్చింది. తొట్టంబేడు వద్ద ఇఎంటి సుధాకర్, పిఐకెవౌటి దిలీప్ వైద్య సాయంతో డెలివరీ చేశారు. 108 లోనే సురక్షితంగా డెలివరీ చేసిన సిబ్బందికి మండల ప్రజలు ధన్యవాదాలు తెలిపారు.

నేటి నుంచి సీనియర్ టెన్నిస్ పోటీలు

ప్రజాశక్తి-శ్రీకాళహస్తి: విక్రమ్ టెన్నిస్ అకాడమీ ఆధ్వర్యంలో ఈ నెల 3వ తేదీ నుంచి 9వ తేదీ వరకు ఆల్ ఇండియా సీనియర్ నేషనల్ టెన్నిస్ టోర్నమెంట్ జరుగుతుందని మంగళవారం నిర్వాహకులు తెలిపారు. 35 ఏళ్ల నుంచి 70 ఏళ్ల సీనియర్ క్రీడాకారులు సింగిల్స్, డబుల్స్ విభాగంలో పోటీ పడతారనీ, 75 ఏళ్లు పైబడిన వారు డబుల్స్ పోటీల్లో మాత్రమే పోటీ పడతారని చెప్పారు. విక్రమ్ విద్యాసంస్థలు, విక్రమ్ సూపర్ స్పెషాలిటీ హాస్పిటల్ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న ఈ టెన్నిస్ క్రీడా పోటీలను జయప్రదం చేయాలని కోరారు.



ఎమ్మెల్యే గెలుపు కోసం తిరుమల యాత్రకు వెళ్లిన వైసిపి నాయకులు

మధుసూదన్‌రెడ్డి గెలుపుకోసం తిరుమల యాత్ర

ప్రజాశక్తి -ఏర్పేడు : శ్రీకాళహస్తి ఎమ్మెల్యే బియ్యపు మధుసూదన్ రెడ్డి ఎన్నికల్లో అత్యధిక భారీ మెజారిటీతో గెలవాలని శ్రీవెంకటేశ్వర స్వామి ఆశీస్సులు ఉండాలని ఏర్పేడు మండలం వైసీపీ నాయకులు ఆకాంక్షించారు. ఏర్పేడు మండల వై సీపీ నాయకులు , ఆ పార్టీ మండల అధ్యక్షుడు కూనాటి రమణ యాదవ్, కో ఆప్షన్ బత్తి శెట్టి, సర్పంచుల సంఘ అధ్యక్షుడు నల్ల పాలెం శివయ్య, మాజీ సింగిల్ విండో ఛైర్మన్ నాగార్జున రెడ్డి, ఆ పార్టీ సీనియర్ నాయకులు చంద్రశేఖర్, విజయ్ నాయుడు,పవన్ కుమార్,అయోధ్య, చంద్రశేఖర్ రెడ్డి,శ్రీహరి రాయల్, నవీన్, తదితరులు తిరుమల శ్రీవారిని దర్శించుకున్నారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఎమ్మెల్యే బియ్యపు మధుసూదన్ రెడ్డి అత్యధిక మెజారిటీతో గెలుపొందాలని కోరుకున్నట్లు తెలిపారు.

నేడు ఉపాధ్యాయుల నిరసన

ప్రజాశక్తి-బంగారుపాళ్యం: చిత్తూరు ఆర్డీవో కార్యాలయం ఎదుట వంటావార్పుతో యూటీఎఫ్ ఆధ్వర్యంలో బుధవారం నిరసన చేపట్టనున్నట్లు జిల్లా కార్యదర్శి సరిత మంగళవారం ఒక ప్రకటనలలో తెలిపారు. వబుధవారం ఉదయం 8 నుంచి రాత్రి 8 వరకు కార్యక్రమం జరుగు తుందన్నారు. ఉపాధ్యాయులు అధిక సంఖ్యలో పాల్గొనాలని పిలుపునిచ్చారు.

IN THE COURT OF THE HON'BLE II JUNIOR CIVIL JUDGE CITY CIVIL COURT AT HYDERABAD

O.S.No. 2897 of 2023

Between:
Union Bank of India
(A Govt. of India undertaking)
[Formerly] Andhra Bank, Credit Card Division, Koti, Hyderabad,
Rep.by its Sr.Manager & Authorized Officer, Mr.Ch.V.Gopal Reddy, S/o.Mr.Vijaya Bhaskar Reddy, aged about 35 Years, R/o.Hyderabad
...Plaintiff

AND

Smt. A. Vara Lakshmi, ...Defendant
To, Smt. A. Vara Lakshmi, W/o. A.Narasimhulu Naidu,
Aged about 41 years, Occ: Business, R/o.D.No.10-15-18A, 1" Floor, K.K.Layout, Tirupathi, A.P.-517501.

Take Notice that the above mentioned Suit is filed against you for recovery of a Rs.2,63,231-03 ps_towards utilization of Credit card. The above mentioned Suit is posted for your appearance on 29-01-2024.

In case of your failure attend before the Court on 29-01-2024 at 10-30 A.M. either in person or through a Counsel the matter will be decided in your absence by setting you exparte.

(BY ORDER OF THE COURT)

T. BHAGYA RAJU
& Associate Advocates,
Counsel for the Plaintiff,
Flat No.402, Nirmal Ratna Aprts,
Opp: R.S.Brothers, Chandanagar,
Gangaram Village,
HYDERABAD-50.